సాక్షి
చిత్తూరు
ఆదివారం । 4 । మే । 2025



పరిశ్రమల స్థాపనతో ఉపాధి

పరిశ్రమల స్థాపనతో మహిళలకు ఉపాధి లభిస్తుందని వర్క్‌షాప్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. - IIలో



ఇసుకాసురుల అరాచకం

కౌండిన్య నదిలో ఇసుకాసురులకు అడ్డొస్తున్న అన్నదాతల మోటార్లను అదృశ్యం చేస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు. - IIలో



ఒంటరి ఏనుగు బీభత్సం

పెద్దపంజాణి మండలంలో ఒంటరి ఏనుగు బీభత్సం సృష్టించి పాడి ఆవులపై దాడి చేయడంతో బెంబేలెత్తుతున్నారు. - IIలో

న్యూస్‌రీల్

అయ్యప్ప సేవలో పెద్దిరెడ్డి దంపతులు



ఎమ్మెల్యే పెద్దిరెడ్డిని కలిసిన నాయకులు

సదుం : మండలంలోని ఎర్రాతివారిపల్లె అయ్యప్పస్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, స్వర్ణలతమ్మ దంపతులు శనివారం సందర్శించారు. అయ్యప్ప స్వామి ఆలయంలో అర్చకులు పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. నవగ్రహ ఆలయంలో అర్చకుల ఆధ్వర్యంలో అభిషేకాలు చేశారు. సదుమమ్మకు ప్రత్యేక పూజలు చేయించారు. పలువురు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయనను పలువురు వైఎస్సార్ సీపీ యూత్ విభాగం సభ్యులు కలిశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి, వైస్ ఎంపీపీ ధనుంజయరెడ్డి, ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, పుత్రాజు, హరినాథరెడ్డి, మనోజ్, మనోహర్ రెడ్డి, ఇర్ఫాన్, దాము తదితరులు పాల్గొన్నారు.

టీబీ పరీక్షలు విధిగా చేయాలి



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : టీబీ పరీక్షలు విధిగా చేయాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి ఆదేశించారు. చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శనివారం శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఓపీలో 10 శాతం తప్పనిసరిగా టీబీ పరీక్షలు చేయాలన్నారు. పీహెచ్‌సీ పరిధిలో ఆశా వర్కర్లు అనుమానిత వ్యక్తులకు గళ్ల పరీక్షలు చేయించాలన్నారు. అలాగే డెంగ్యూ కేసులపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా క్షయనివారణ అధికారి వెంకట ప్రసాద్, మలేరియా అధికారి వేణుగోపాల్ పాల్గొన్నారు.

పీఎఫ్ సమస్యలు పరిష్కరించాలి

- జెడ్పీ సీఈఓకు వైఎస్సార్‌టీఏ నేతల వినతి



జెడ్పీ సీఈఓకు వినతిపత్రం ఇస్తున్న రాష్ట్ర నాయకులు రెడ్డిశేఖర్‌రెడ్డి

చిత్తూరు కార్పొరేషన్ : జెడ్పీ ఉద్యోగుల సమస్యలపై సీఈఓ రవికుమార్ నాయుడును ఏపీ వైఎస్సార్ టీచర్ అసోసియేషన్ నాయకులు కలిశారు. శనివారం జెడ్పీ కార్యాలయంలో సీఈఓకు పలు సమస్యల పై వినతి పత్రం అందించి మాట్లాడారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి రెడ్డిశేఖర్‌రెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షుడు సోమచంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జయకాంత్ మాట్లాడారు. 2023–24కు సంబంధించి పీఎఫ్ వార్షిక స్లిప్స్‌ను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలన్నారు. పీఎఫ్ ఫైనల్ పేమెంట్స్ కోసం దరఖాస్తు చేసుకున్నవారికి నాన్ డ్రాయల్, నో డ్యూ ధ్రువీకరణ పత్రాలు సమర్పించే విధానాన్ని తీసివేయాలన్నారు. పది సంవత్సరాల ముందు పదవీ విరమణ పొందిన చందాదారుల నిల్వ సొమ్ములు చాలా మందికి చెల్లించాల్సి ఉందన్నారు. పలమనేరు సబ్ ట్రెజరీ ద్వారా జరిగిన చెల్లింపులు సీఎఫ్ఎంఎస్ నందు సక్రమంగా అప్‌లోడ్ చేయనందున ఖాతాదారులకు నేటికి జమ కాలేదన్నారు. సమస్యలను పరిష్కరించి చర్యలు తీసుకోవాలని వివరించారు.

కాణిపాకంలో మైనారిటీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ



చిత్రపటం అందజేస్తున్న ఈఓ పెంచలకిషోర్

కాణిపాకం : కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని శనివారం రాష్ట్ర మైనార్టీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ సీహెచ్ శ్రీధర్ దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన ఆయనకు ఆలయ ఈఓ పెంచల కిషోర్ ఘన స్వాగతం పలికారు. దగ్గరుండి స్వామి దర్శనం కల్పించారు. అనంతరం వేద ఆశీర్వచన మండపంలో పండితులు ఆశీర్వచనాలు చేశారు. అనంతరం ప్రసాదం, స్వామి చిత్రపటం అందజేశారు.

తరగతులకు ఎగనామం



పది సప్లిమెంటరీ విద్యార్థుల కోసం రెమిడియల్ తరగతుల పేరుతో వేసవిలో ప్రత్యేక తరగతులు తీసుకోవాలని టీచర్లకు ప్రభుత్వం హడావుడిగా ఉత్తర్వులు జారీ చేసింది. అయితే సరైన విధి విధానాలు చూపకుండా ఏదో జీఓ జారీ చేసేశామని రాష్ట్ర విద్యాశాఖ చేతులు దులిపేసుకుంది. ఫలితంగా చిత్తూరు జిల్లాలో శనివారం నుంచి జరగాల్సిన రెమిడియల్ తరగతుల నిర్వహణ జాడే కనిపించలేదు. పైగా వీటిని పర్యవేక్షించాల్సిన అధికారులు సైతం పట్టించుకోకపోవడంతో రెమిడియల్ తరగతుల నిర్వహణ మేడిపండు చందంగా మారింది. మండు వేసవిలో తరగతుల నిర్వహణ ఏంటని టీచర్లు విధులకు మూకుమ్మడిగా డుమ్మాకొట్టడం కొసమెరుపు.



మూకుమ్మడిగా రెమిడియల్ తరగతులకు టీచర్లు డుమ్మా

- కానరాని 'పది' సప్లిమెంటరీ విద్యార్థుల ప్రత్యేక తరగతులు
- రెమిడియల్ పేరుతో టీచర్లను వేధించడం సరికాదు
- రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులపై మండిపాటు
- ఉత్తర్వులు ఉప సంహరించుకోవాలని డిమాండ్



వేసవి సెలవుల్లో టీచర్లను వేధించడం సరికాదంటూ ప్రకటనలో పేర్కొన్న పీడీఎఫ్ ఎమ్మెల్సీ గోపీమూర్తి

సాక్షి టాస్క్‌ఫోర్స్: విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఉంటే జిల్లాలో మంచి ఫలితాలు సాధ్యపడేవి. అయితే జిల్లా విద్యాశాఖ అధికారులు మెరుగైన ఫలితాల సాధనకు ఎలాంటి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేయని పరిస్థితి నెలకొంది. దీంతో 2024–25 విద్యా సంవత్సరం 'పది' ఫలితాల్లో సీఎం చంద్రబాబు సొంత జిల్లా చిత్తూరు రాష్ట్రంలో 24వ స్థానంకు దిగజారింది. ఈ ఫలితాలపై ఇటీవల జిల్లా స్థాయిలో నిర్వహించిన జెడ్పీ సర్వసభ్య సమావేశంలో జెడ్పీటీసీలు, ఎంపీపీలు విద్యాశాఖ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చేతులు కాలాక ఆకులు పట్టుకున్నారనే చందంగా పది పరీక్షల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో ఫెయిల్ అయిన తర్వాత రెమిడియల్ తరగతులంటూ ఆర్భాటం చేస్తోంది. ఈ ఆర్భాటంలో భాగంగా జిల్లాలోని ప్రతి పాఠశాలలో పది ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం ఈనెల 2వ తేదీ నుంచి రెమిడియల్ తరగతులు నిర్వహించాలంటూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఉత్తర్వులు హడావుడిగా రాత్రిపూట

రెమిడియల్ తరగతులు 2వ తేదీ నుంచి నిర్వహించాలని షెడ్యూల్ లో పేర్కొని ఉత్తర్వులేమో అదే తేదీ రాత్రికి రాష్ట్ర విద్యాశాఖ అధికారులు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల్లో రెమిడియల్ తరగతుల నిర్వహణకు సంబంధించిన షెడ్యూల్ ప్రత్యేకంగా పేర్కొన్నారు. ఆ షెడ్యూల్‌లో ఈనెల 2వ తేదీ నుంచి తరగతులు ప్రారంభించాలని సూచించారు. అయితే ఉత్తర్వులు మాత్రం 2వ తేదీ రాత్రి విద్యాశాఖ అధికారులకు పంపించారు. ఇలాంటి ఆకస్మిక ఉత్తర్వుల జారీపై టీచర్లు విమర్శలు గుప్పిస్తున్నారు.

జిల్లాలో కనిపించని తరగతుల నిర్వహణ

కూటమి ప్రభుత్వం జారీచేసిన పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల రెమిడియల్ తరగతుల నిర్వహణ జిల్లాలో ఈనెల 3 వ తేదీ ఎక్కడా నిర్వహించ లేదు. ఈనెల 2వ తేదీ నుంచి 18వ తేదీ వరకు రెమిడియల్ తరగతులను ప్రతి ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. షెడ్యూల్ ప్రకారం ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు రెమిడియల్ తరగతులు నిర్వహించాలని సూచించారు. అయితే జిల్లాలోని చిత్తూరు, పలమనేరు, కుప్పం, నగరి, పూతలపట్టు, జీడీ నెల్లూరు, పుంగనూరు నియోజకవర్గాల్లో ఎక్కడ కూడా రెమిడియల్ తరగతుల నిర్వహణ జాడే కనిపించలేదు.

మూకుమ్మడిగా బహిష్కరణ

జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల టీచర్లు మూకుమ్మడిగా రెమిడియల్ తరగతుల ఉత్తర్వులను పాటించకుండా బహిష్కరించారు. వేసవి సెలవుల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విధులు ఎవరు నిర్వహిస్తారంటూ రెమిడియల్ తరగతులకు హాజరు కాకుండా డుమ్మా కొట్టారు. ముఖ్యంగా ఈ తరగతులను పర్యవేక్షించి పకడ్బందీగా అమలు చేయాల్సిన హెడ్‌మాస్టర్‌లే విధులకు డుమ్మా కొట్టారు. అయితే ఈ తరగతుల పర్యవేక్షణను ఎంఈఓలు, డీవైఈఓలు, డీఈవో సైతం పర్యవేక్షించని పరిస్థితి నెలకొంది. జిల్లా వ్యాప్తంగా ఈనెల 3వ తేదీన ఎన్ని పాఠశాలల్లో రెమిడియల్ తరగతులు నిర్వహించారో? ఎంత మంది విద్యార్థులు హాజరయ్యారో? ఎంత మంది టీచర్లు విధులకు హాజరయ్యారనే వివరాలు విద్యాశాఖ అధికారుల వద్దే లేని పరిస్థితి. ఈ తరగతుల నిర్వహణపై అయ్యోర్లు గుర్రుమంటుండంతో కూటమి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాల్సి ఉంటుంది.

వేధింపులపై ఆగ్రహం

రెమిడియల్ తరగతుల పేరుతో టీచర్లను వేధించడం సరికాదని ఉపాధ్యాయ సంఘం నేతలు కూటమి ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉత్తీర్ణులు కానీ విద్యార్థుల కోసం రెమిడియల్ తరగతుల పేరుతో ఉత్తర్వులు జారీ చేయడంపై టీచర్లు విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ ఉత్తర్వులు టీచర్ల వేసవి సెలవులను నిరోధించేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్ర అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండు వేసవిలో ప్రభుత్వ ఉపాధ్యాయులను వేధించేందుకు తీసుకున్న రెమిడియల్ తరగతుల ఉత్తర్వులను రద్దు చేయాలని ఉపాధ్యాయ సంఘం నేతలు డిమాండ్ చేస్తున్నారు.

నేడే నీట్

- పరీక్షకు పక్కాగా ఏర్పాట్లు చేసిన అధికారులు
- జిల్లాలో 2 పరీక్ష కేంద్రాలు
- హాజరు కానున్న 710 విద్యార్థులు



పరీక్ష కేంద్రంలో మౌలిక వసతులు పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న నీట్ (నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్) ఆదివారం జరగనుంది. వైద్య కోర్సుల్లో ప్రవేశానికి అర్హత పరీక్షగా గుర్తింపు పొందిన ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 710 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే జిల్లాలో రెండు పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లను కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, ఎస్పీ మణికంఠ చందోలు స్వయంగా పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పరీక్షల నిర్వహణకు అధికారిక యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేసింది.

ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలి

నీట్‌కు జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాల కేంద్రాలను ఏర్పాటు చేశారు. పీవీకేఎన్‌లో 432 మంది, సావిత్రమ్మ మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 278 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్ష ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నారు. ఈ పరీక్షకు అన్ని నియమ, నిబంధనలు పాటిస్తూ 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటలలోపు పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులు చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. మధ్యాహ్నం 1.30 గంటలలోపు ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఉండదని అధికారులు వెల్లడించారు.

అమరావతి అభివృద్ధి చేస్తే చాలా?



మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం : ఒక్క అమరావతి అభివృద్ధి చెందితే ఇతర ప్రాంతాల అభివృద్ధి అవసరం లేదా.. అని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ప్రశ్నించారు. శనివారం పుత్తూరులోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. గతంలో నరేంద్ర మోదీ ప్రధామంత్రి హోదాలో అమరావతి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తే మిగిలిన ప్రాంతాలు వెనుకబడి పోతాయని డిమాండ్ చేసిన పవన్ కళ్యాణ్ నేడు ఒకే ప్రాంతం అభివృద్ధికి పెద్దపీట వేస్తుంటే ఉప ముఖ్యమంత్రి నోరు మెదపక పోవడం శోచనీయమన్నారు. గతంలో ఢిల్లీ నడిబొడ్డున ముఖ్యమంత్రి హోదాలో నారా చంద్రబాబు.. మోదీని ఇష్టమొచ్చినట్లు తిట్టి.. నేడు మోదీని పొగడ్తలతో ముంచెత్తడం చూస్తుంటే బాబు కంటే ఊసరవెల్లే నయమని అన్నారు. అమరావతితో పాటు ఇతర ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్నదే తమ సిద్ధాంతమన్నారు. చంద్రబాబు కుటుంబానికి పోలవరం ఒక ఏటీఎం అని విమర్శించిన మోదీ నేడు చంద్రబాబు విజన్ అని ప్రశంసించడం దారుణమన్నారు. అమరావతి శంకుస్థాపన పేరుతో పబ్లిసిటీ కోసం రూ.500 కోట్లు ప్రజాధనం వృథా అయిందని నారాయణస్వామి విమర్శలు గుప్పించారు.

అక్రమార్జనే.. కూటమి పాలన!

- చట్టవ్యతిరేక కార్యకలాపాలు ఎమ్మెల్యే కనుసన్నల్లోనే..
- సంక్షేమ పథకాలు ఎక్కడ ? సూపర్ సిక్స్ ఏం చేశారు?
- ప్రశ్నిస్తున్న ప్రతిపక్షంపై తప్పుడు కేసులు.. దాడులు
- జిల్లా కేంద్రంలో కలెక్టర్, ఎస్పీ ఉన్నా నోరు మెదపరు
- పది నెలల కూటమి పాలనలో సామాన్యుడికి నిరాశే
- ఎమ్మెల్యే కుటుంబమే జేబులు నింపుకుని బాగుపడింది..
- చిత్తూరు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త విజయానందరెడ్డి ధ్వజం

సాక్షి ఇంటర్వ్యూ



విజయానందరెడ్డి, చిత్తూరు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త

చిత్తూరు అర్బన్ : 'చిత్తూరు జిల్లా కేంద్రం.. ఇక్కడ కలెక్టర్ నుంచి ఎస్పీతో పాటు 64 ప్రభుత్వ శాఖలు పనిచేస్తున్నాయి. కానీ పట్టపగలే మట్టిను కొల్లగొడుతున్నారు. చీకటైతే గ్రానైట్, ఇసుకను సరిహద్దులు దాటిస్తున్నారు. వీధి వీధికి పేకాట క్లబ్బులు, అక్రమ మద్యం, బెట్టింగులు జరుగుతున్నాయి. వీటన్నింటి నుంచి ప్రతి నెలా ఎమ్మెల్యే కుటుంబానికి మామూళ్లు వెళుతుంటే ఒక్క అధికారి నోరు మెదపడం లేదు. వాళ్ల నాయకుడు చెప్పినట్టు సంపద సృష్టిస్తున్నారు.. అది అసాంఘిక, చట్టవ్యతిరేక పద్ధతుల్లో... ఆ సంపద నేరుగా ఎమ్మెల్యే జేబులోకి వెళుతోంది..' అంటూ చిత్తూరు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ఎం సి.విజయానందరెడ్డి ధ్వజమెత్తారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ పాలన పది నెలలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో విజయానందరెడ్డి 'సాక్షి'తో మాట్లాడారు. చిత్తూరులో అధికార పార్టీ ఎమ్మెల్యే అక్రమాలకు అంతు లేకుండా పోతోందని, దీన్ని ప్రశ్నిస్తున్న ప్రతిపక్షంపై తప్పుడు కేసులు పెట్టడం, ప్రత్యక్ష దాడులకు దిగుతున్నారని దుయ్యబ్బారు.

దర్జాగా దోచేస్తున్నారు

కూటమి పార్టీ ఎమ్మెల్యేగా చిత్తూరులో గెలిచిన తరువాత ఈ పదినెలల కాలంలో అతని కుటుంబం బాగుపడిందే తప్ప, సామాన్యుల తలరాతలు మారిందేమీలేదు. వైన్ షాపులు, గ్రానైట్ ఫ్యాక్టరీలు, పేకాట క్లబ్బుల నుంచి ప్రతి నెలా మామూళ్లు వసూలు చేస్తున్నారు. ఇక చిత్తూరు మండలం నుంచి రోజుకు 25 టిప్పర్లలో ఇసుక తమిళనాడుకు స్మగ్లింగ్ చేస్తూ, ఎమ్మెల్యే తమ్ముడు స్వయంగా పర్యవేక్షిస్తున్నాడు. చిత్తూరు మున్సిపల్ ఆఫీస్‌ను కేంద్రంగా చేసుకుని నగరంలో ఏ ఒక్క బిల్డింగ్ కట్టినా వెంచర్ వేసినా రూ.లక్షల్లో మామూళ్లు వసూలు చేస్తున్నారు. బీజేపీ చెందిన ఓ వ్యక్తి వెంచర్ వేస్తే రూ.లక్షల్లో లంచం డిమాండ్ చేసిన మాట వాస్తవం కాదా..? ఇందులో కార్పొరేషన్ ఏసీపీ మధ్యవర్తిగా వ్యవహరిస్తున్నాడు. స్క్రాప్ (తుక్కు) వ్యాపారాలు చేసేవాళ్ల నుంచి కిలోకు రూపాయి చొప్పున నెలకు రూ.30 లక్షలకు పైనే అక్రమార్జన చేస్తున్నా అడిగే దిక్కులేదు. హై రోడ్డు విస్తరణ పేరిట ఓ డెయిరీను రూ.80 లక్షలు డిమాండ్ చేశారు. అసలు పరిహారం ఇవ్వకుండా విస్తరణ ఎలా చేస్తారు..? ఎమ్మెల్యే దందాలకు బెదరనివాళ్లపై కేసులు పెడతాం, బిల్డింగ్ కొట్టేస్తాం, అప్రూవల్స్ ఇవ్వం అంటూ బ్లాక్‌మెయిల్ చేసి దారికి తెచ్చుకుంటున్నారు. కార్పొరేషన్ కార్యాలయం పూర్తిగా ఎమ్మెల్యే అనుచరుల చేతికి వెళ్లిపోయింది. అసలు ఎన్ఆర్ఐ రవి ఎవరు..? ఆర్ఎస్.నాయుడు ఎవరు..? వీళ్లు అధికారులను శాసించడం ఏంటి..? జరగనున్న కౌన్సిల్ సమావేశంలో వీటిపై మా కార్పొరేటర్లు ప్రశ్నించడానికి అన్ని ఆధారాలు సేకరిస్తున్నాం.

ప్రజలకు ఏం చేశారు ?

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నీటిరాతలైపోయాయి. చిత్తూరులో ఇండస్ట్రియల్ హబ్ ఎక్కడ..? ఐటీ పార్కు ఏదీ..? యూనివర్సిటీ ఎక్కడ పెట్టారు..? మీరు (టీడీపీ) ఇచ్చిన ఇలాంటి ఎన్నో హామీలు కాగితాల్లోనే మిగిలిపోయాయి. మా పార్టీ అధికారంలో ఉన్నపుడు ప్రతి ఒక్క కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించాం . కానీ ఇప్పుడు.. సూపర్‌సిక్స్‌లో పింఛన్ తప్ప ఏదైనా అమలు చేశారా..? మేము మార్కెట్ గేటు ఉచితం చేస్తే, ఇప్పుడు మార్కెట్ టెండర్లలో టీడీపీ సీనియర్లు పాల్గొనకుండా బెదిరించి దక్కించుకుని, గేటు పేరిట రైతుల రక్తం పీల్చేస్తున్నారు. ఆన్‌లైన్ టెండర్లలో పనులు దక్కించుకున్నవాళ్లను బెదిరించి టెండరు వద్దని బలవంతంగా సంతకాలు పెట్టించుకుంటున్నారు. ఇందులో కూటమి నేతలూ బాధితులే.

ప్రతి కార్యకర్తకు అండగా..

అధికార పార్టీ అక్రమాలు ఎండగట్టడంలో మా పార్టీ సోషల్ మీడియా బలంగా ఉంది. తప్పులను ఎత్తిచూపిస్తుంటే తట్టుకోలేక దాడులు చేస్తున్నారు. చిత్తూరులో నాపై అయిదు అక్రమ కేసులు పెట్టారు. మా వాళ్లపై 50కు పైగా కేసులు నమోదు చేశారు. మహిళలపై కూడా అక్రమ కేసులు పెట్టారు. అయినా సరే వీటికి భయపడేదిలేదు. మా పార్టీ అధ్యక్షుడు వైఎస్.జగన్ ఆదేశాలతో గ్రామస్థాయి నుంచి పార్టీను బలోపేతం చేస్తున్నాం. కూటమి తప్పుడు కేసులు పెట్టినా కార్యకర్తలకు ఉచితంగా న్యాయసేవలు, బెయిల్ ఇప్పించడం చేస్తున్నాం. మా జిల్లా అధ్యక్షుడు కరుణాకరరెడ్డి పాత బస్టాండు కొట్టేయాలన్న ఎమ్మెల్యే కుట్రపై గళం విప్పి అడ్డుకున్నారు. కార్యకర్తలపై దాడులను ప్రశ్నిస్తున్నారు. భవిష్యత్తు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీదే. తప్పు చేసిన ఏ ఒక్కర్నీ వదిలే ప్రసక్తేలేదు.

అకాలవర్షం.. అపారనష్టం



చిత్తూరు మండలంలోని సిద్ధంపల్లిలో రైతు పంటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారులు

- జిల్లాలో గాలీవాన బీభత్సంతో దెబ్బతిన్న పంటలు
- అధిక విస్తీర్ణంలో దెబ్బతిన్న మామిడి
- 171.46 హెక్టార్లలో పండ్లతోటల నష్టం గుర్తింపు
- నష్టం మరింత పెరిగే అవకాశం

చిత్తూరు రూరల్ : జిల్లాలో శుక్రవారం సాయంత్రం కురిసిన అకాలవర్షం అతలాకుతలం చేసింది. బలమైన ఈదురుగాలులు పలు రకాల పంటలను దెబ్బతీసింది. దీని దాటికి పలు చోట్ల మామిడికి అపార నష్టం వాటిల్లింది. చెట్లు నేలవాలడంతో పాటు మామిడి కాయలు మొత్తం నేలరాలాయి. అలాగే అరటి, బొప్పాయి, కొబ్బరి పంటలు కూడా నష్టాన్ని మిగిల్చాయి. ఈ సమాచారం అందుకున్న ఉద్యానశాఖ అధికారులు శనివారం పంట పరిశీలనలో పడ్డారు. 7 మండలాల పరిధిలో పంట దెబ్బతిన్నట్లు గుర్తించారు. అధికంగా మామిడి పంట నష్టపోయినట్లు అంచనా వేశారు. మామిడితో పాటు పలు రకాల పంటలు మొత్తం 171.46 హెక్టార్లల్లో పంట దెబ్బతింటే 404 రైతులు నష్టపోయినట్లు అధికారులు అంచనా వేశారు. పెనుమూరు మండలంలో మామిడి 12 హెక్టార్లు, యాదమరిలో అరటి ఒక హెక్టారు, మామిడి 5 హెక్టార్లు, చిత్తూరులో అరటి 0.8 హెక్టార్లు, బొప్పాయి 0.4 హెక్టార్లు, మామిడి 54 హెక్టార్లు, కొబ్బరి 0.06 హెక్టార్లు, గుడిపాలలో అరటి 1.6 హెక్టార్లు, బొప్పాయి 0.4 హెక్టార్లు, మామిడి 25 హెక్టార్లు, పలమనేరులో 39 హెక్టార్లు, తవణంపల్లిలో మామిడి 22.2 హెక్టార్లు, ఐరాలలో మామిడి 10 హెక్టార్లల్లో నష్టం జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఈ నష్టం మరింతగా పెరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.






చిత్తూరు మండలం పెరుమాళ్ల కండ్రిగ గ్రామంలో నేలవాలిన మామిడి చెట్లు

కొండచిలువ కలకలం

మండలంలోని శ్రీసిద్దేశ్వర స్వామి కొండ గ్రామంలో శనివారం కొండ చిలువ కలకలం రేగింది. శనివారం చీకటి సమయంలో చెట్ల పొదల నుంచి రోడ్డు మీదకు జనసంచారం ఉన్న ప్రాంతంలోకి రాగానే భయభ్రాంతులకు గురైన జనం కేకలు వేస్తూ పరుగులు తీశారు. దీంతో గ్రామస్తులు భయంతో కొండ చిలువను కొట్టి చంపేయడంతో ఊపిరి పీల్చుకున్నారు.

– గంగాధర నెల్లూరు



క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీలో చోటు

చిత్తూరు అర్బన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అనుబంధ కమిటీలో ఉమ్మడి జిల్లాలోని పలువురికి చోటు కల్పిస్తూ..పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఒక ప్రకటనను విడుదల చేసింది. చంద్రగిరికి చెందిన అన్వర్ బాషాను, శ్రీకాళహస్తికి చెందిన మహ్మద్ రసూల్‌ను రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శులుగా, నగరికి చెందిన మోహన్ రెడ్డిని రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శిగా, చంద్రగిరికి చెందిన నాగేనమ్మను రాష్ట్ర అంగన్‌వాడీ విభాగ కార్యదర్శిగా, నగరికి చెందిన గోపాల్ రెడ్డిని రాష్ట్ర ఎంప్లాయిస్, పెన్షన్ విభాగ సహాయ కార్యదర్శిగా నియమిస్తున్నట్లు కేంద్ర పార్టీ కార్యాలయం ప్రకటనలో పేర్కొంది.

దళితుల శ్మశానవాటిక ఆక్రమణ

– తహసీల్దార్, పోలీసులకు ఫిర్యాదు



శ్మశాన వాటికను దున్నేసిన ఆక్రమణదారుడు

చౌడేపల్లె : మండలంలోని పెద్దయల్లకుంట్ల పంచాయతీ చిప్పిలివారిపల్లె దళితులకు చెందిన శ్మశానవాటిక (ఒలికిల గడ్డ) ఆక్రమణకు గురైందని గ్రామస్తులు శనివారం తెలిపారు. శుక్రవారం రాత్రి అదే గ్రామానికి చెందిన చిప్పిలి రెడ్డెప్ప అతని కుటుంబీకులు ట్రాక్టర్‌తో రాత్రి సమయంలో దున్నుతుండగా అడ్డుకోబోయిన వారిపై దౌర్జన్యం చేసి దున్నేశారని ఎర్రప్ప.. తహసీల్దార్, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన కథనం మేరకు వివరాలిలా...ఒలికిలగడ్డలో కొన్నేళ్లుగా తమ పూర్వీకుల నుంచి నేటికీ అదే శ్మశాన వాటికలో ఖననం చేసేవాళ్లమన్నారు. 248/3 సర్వే నంబరులో 66 సెంట్ల స్థలంలో సమాధులున్నాయని, వాటిని రాత్రిపూట దున్నేయడంతో అధికారులను ఆశ్రయించామని చెప్పారు. శ్మశాన వాటిక స్థలం తమదని ఆక్రమణదారుడు చెప్పడంతో ఇన్నాళ్లు పొలంలోకి రాని అతను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తమపై దాడికి యత్నిస్తున్నారని దళితులు ఆవేదన వ్యక్తం చేశారు. పూర్వీకుల సమాధులను దున్నేయడంతో పాటు బండరాళ్లను సైతం ధ్వంసం చేశారని కన్నీటి పర్యంతమయ్యారు. కలెక్టర్ స్పందించి దళితులకు న్యాయం చేయాలని కోరారు.

సర్వదర్శనానికి 20 గంటలు

తిరుమల: తిరుమలలో రద్దీ అధికంగా ఉంది. సర్వ దర్శనానికి 20 గంటల సమయం పడుతోంది. క్యూకాంప్లెక్స్‌లో 20 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 74,344 మంది స్వామివారిని దర్శించుకోగా 32,169 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.50 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 20 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.



క్యాటిల్ ఫామ్ వద్ద ఇసుక తవ్వకాలు చేస్తున్న జీడిమాకులపల్లి ఇసుకాసురులు

ఇసుకాసురుల అరాచకం

కౌండిన్య నదిలో ఇసుకాసురుల అరాచకాలు అంతేలేకుండా పోతున్నాయి. ఇసుక దోపిడీకి అన్నదాతలు అడ్డొస్తున్నారని వారికి చుక్కలు చూపిస్తున్నారు. పంటలకు ఆదరువుగా ఉన్న వ్యవసాయ మోటార్లను అదృశ్యం చేసి రైతుల జీవితాలతో చెలగాటం ఆడుగుతున్నారు. కూటమి పదినెలల పాలనలో 50కిపైగా మోటార్లు చోరీ కావడం ఆందోళన కలిగిస్తోంది.

కౌండిన్య నదిలో మోటార్ల అపహరణ

- పది నెలల్లో 50కి పైగా వ్యవసాయ మోటార్ల చోరీ
- ఇసుకాసురులకు అడ్డుపడితే..అంతే..!
- రాగి తీగల కోసం మరికొందరు చోరులు
- మోటార్ల చోరీతో ఎండుతున్న పంటలు
- పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం



నదిలో డంప్ చేసిన ఇసుక..

పలమనేరు : జిల్లాలోని కౌండిన్య నది పుంగనూరు, పలమనేరు నియోజకవర్గాల మీదుగా తమిళనాడులోని మోర్ధన డ్యాం దాకా ప్రవహిస్తుంది. కౌండిన్య నదిని ఆనుకొని గుంతల్లో ఫిల్టర్ పాయింట్‌లో సబ్ మెర్సిబుల్ మోటార్‌లను అమర్చుకొని పంటలకు సాగునీటిని అందిస్తున్న రైతులకు ఇసుకాసురులు ఇప్పుడు విలన్‌లుగా మారారు. ఇసుక తవ్వకాలకు అడ్డొస్తున్నారని రైతులపై కసి పెంచుకున్న ఇసుకాసురులు మోటార్లు చోరీ చేసి పైశాచిక ఆనందం పొందుతున్నారు. మరోవైపు కొంత మంది యువకులు మద్యానికి బానిసై మోటార్లను చోరీ చేస్తున్నారు. దీంతో సాగునీటిని అందించలేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మోటార్ల చోరీలు ఎక్కువైనట్లు రైతులు ఆవేదన చెందుతున్నారు. కౌండిన్య నదికి ఆనుకుని రెండు వైపులున్న రైతుల మోటార్లు ఈ పది నెలల్లో 50కి పైగా చోరీ అయ్యాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇంకా పోలీసులకు అందని ఫిర్యాదులు ఎక్కువగానే ఉన్నట్లు తెలుస్తోంది. ఇసుక అక్రమ రవాణాకు అడ్డు తగిలిన రైతులకు చుక్కలు చూపిస్తున్నారు. ఇదే ప్రాంతంలో గత నాలుగు నెలలో పది మోటార్లు చోరీకి గురయ్యాయి. కానీ ఈ చోరీలపై పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

మోటార్లను కనిపించకుండా చేసేస్తున్నారు..

పుంగనూరు నియోజకవర్గంలోని పుంగనూరు, పలమనేరు నియోజకవర్గంలోని పెద్దపంజాణి, గంగవరం, పలమనేరు మండలాల గుండా ప్రవహించి తమిళనాడు రాష్ట్రం ద్వారా బంగాళాఖాతంలో చేరే కౌండిన్య నదికి ఆనుకొని వ్యవసాయం చేసే రైతులు వేల సంఖ్యలో ఉన్నారు. వీరు నదిలోని ఇసుక కారణంగా ఆరు ఇంచీల బోర్లను వేయలేరు. దీంతో మాన్యువల్‌గా ఫిల్టర్ పాయింట్‌ల ద్వారా 30 అడుగులు లోతు దాకా రెండు, మూడు ఇంచీల బోర్లను డ్రిల్ చేసి అందుకు 3 హెచ్‌పీ, 5హెచ్‌పీ సబ్ మెర్సిబుల్ మోటార్లను అమర్చుకొని పంటలను సాగు చేసుకుంటున్నారు. మరికొంత మంది పేద రైతులు నదిలోని చెక్‌డ్యామ్‌ల వద్ద గుంతల్లో నిలిచిన నీటికి మోటార్ అమర్చి పంటలను సాగు చేస్తున్నారు.



తాజాగా మోటార్ చోరీ అయిన వనార్ధన్‌రెడ్డి మోటారు

అయితే నదిలో ఇసుక ఉంటేనే వీరికి నీటి లభ్యత ఉంటుంది. కానీ ఇసుకాసురులు జేసీబీలు పెట్టి మొత్తం ఇసుకను తోడేస్తున్నారు. దీంతో కడుపు మండిన రైతులు వారిని అడ్డుకుంటే రైతుల మోటార్లు కనిపించకుండా చేస్తున్నారు.

ఓ పూట మందు కోసం కొందరు...

ఇసుకాసురుల అరాచకాలకు తోడు వ్యసనాలకు అలవాటు పడిన కొందరు యువకులు కౌండిన్య నదికి ఆనుకుని ఉన్న మోటార్లు, కేబుల్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లను టార్గెట్ చేసి వాటిని దొంగలించి అందులోని సిల్వర్, కాపర్ తీగలను పట్టణంలోని గుజిడీ దుకాణాలకు అమ్మి వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. వీరి జల్సాల కోసం ఎంత మంది రైతుల పంటలు ఎండుతున్నాయే, ఆ రైతులు ఎంత ఇబ్బందులు పడుతున్నారో ఆ దేవుడికే తెలుసు.

అధికారులకు తెలియందేమీకాదు

కౌండిన్య నదిలో నిత్యం ఇసుకను తరలిస్తున్న వారెవరు, ఇసుక డంపులు ఎక్కడున్నాయి. కర్ణాటకకు వెళుతున్న ఇసుక, ఏ గ్రామంలో ఇసుక స్మగ్లర్లున్నారు. ఎవరికి ఎన్ని ట్రాక్టర్‌లున్నాయి. కొత్తగా జేసీబీలు కొని మరీ ఇసుక తోడుతున్న వారెవరో రెవెన్యూ, మైనింగ్, పోలీసు అధికారులు తెలియందేమీకాదు. అంతెందుకు గత ప్రభుత్వంలో ఇక్కడ అత్యంత కీలకంగా ఉన్న స్పెషల్ బ్రాంచి, ఇంటెలిజెన్స్‌లు కూటమి పాలనలో కళ్లు కనిపించని కబోధులుగా మారారనే విషయం ప్రజల్లోనే కాదు పోలీసుశాఖలోనే వినిపిస్తుండడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

పోలీసులు నిఘా పెట్టాలి



కౌండిన్య నదికి ఆనుకొని ఎంతో మంది రైతులు ఫిల్టర్ బోర్ల ద్వారా పంటలను సాగు చేసుకుంటున్నారు. అక్కడున్న ఇసుకను తోడేస్తే వారికి నీరు రాదని ఇసుకాసురులను అడ్డగిస్తున్నారు. దీంతో వారిపై కోపం పెంచుకొన్న వారు మోటార్లను చోరీ చేస్తున్నారా లేదా ఇంకెవరైనా వీటిని దొంగలిస్తున్నారా పోలీసులు గుర్తించాల్సి ఉంది. ఏదైనా కేసులొస్తే వారు పట్టించుకోకపోవడంతో ఈ దొంగతనాలు ఆగడం లేదు. ఈ చోరీల వ్యవహారంపై పోలీసులు పూర్తి స్థాయిలో నిఘా పెట్టి రైతులకు న్యాయం చేయాలి.

– వెంకటేగౌడ, వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి, పలమనేరు

పంటలు ఎండిపోతున్నాయి



కౌండిన్య నది పక్కన భూమి ఉంది. నదిలో మోటారు వేసుకొని సాగు చేసుకుంటున్నా. మూడు రోజుల కిందట నా బోరుకు ఆనుకొని జేసీబీతో ఇసుకను తోడుతుండగా అభ్యంతరం చెప్పా. ఆ మరుసటి రోజు చూస్తే నా మోటారు కనిపించలేదు. అందుకే అనుమానంతో ఇసుకాసురులపై పోలీసులకు ఫిర్యాదు చేశా. ఈ అరాచకాల వల్ల పంట నిలువునా ఎండిపోతోంది.

– వనార్ధన్ రెడ్డి, రైతు, కొంగోళ్లపల్లి, గంగవరం మండలం

పరిశ్రమల స్థాపనతో మహిళలకు ఉపాధి

- టైలరింగ్ శిక్షణ వర్క్‌షాప్‌లో ఎమ్మెల్యే, కలెక్టర్ సుమిత్‌కుమార్



హాజరైన మహిళలు

గంగవరం : ఒక కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే ఆ ఇంటి యజమానితో పాటు మహిళలకు కూడా జీవనోపాధి లభించినప్పుడే ఆర్థిక ఇబ్బందులు ఉండవని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. గంగవరం మండలంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో తమిళనాడు రాష్ట్రం తిరువూరుకు చెందిన ఈస్ట్‌మెన్ ఎక్స్‌పోర్ట్స్ గ్లోబల్ క్లాతింగ్ టెక్స్‌టైల్స్ పరిశ్రమ ద్వారా పలమనేరు పరిసర ప్రాంతంలో ఏర్పాటు చేసే కంపెనీలో పని చేసేందుకు పలమనేరు, గంగవరం, పెద్దపంజాణి, బైరెడ్డిపల్లి ప్రాంతాల్లో టైలరింగ్ అనుభవం ఉన్న డ్వాక్రా సంఘాల మహిళలకు శనివారం వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే అమర్‌నాథరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పరిశ్రమల స్థాపనతోనే మహిళలకు ఉపాధి కల్పన జరుగుతుందన్నారు. గార్మెంట్స్ ఏర్పాటు ద్వారా పలమనేరు పరిసర ప్రాంతాల్లో దాదాపు 4 వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. ఎమ్మెల్యే అమర్‌నాథరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి మహిళను పారిశ్రామికవేత్తగా తయారు చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, కంపెనీ సీఈఓ రితేష్‌కుమార్, జనరల్ మేనేజర్ మొయిద్దీన్, డీపీసీ ఏడీ వెంకటరెడ్డి, ఏపీఐఐసీ మేనేజర్ ఇస్మాయిల్, పలమనేరు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు సోమశేఖర్‌గౌడ్, ఏపీఎంలు, డీపీఎంలు, సీసీలు, మహిళలు పాల్గొన్నారు.

పశువులపై ఒంటరి ఏనుగు బీభత్సం

- అక్కడికక్కడే ఒక ఆవు మృతి
- చావు బతుకుల మధ్య మరొక్కటి



గాయపడిన ఆవుకు చికిత్స చేస్తున్న పశువైద్యులు

పెద్దపంజాణి : పాడి పశువులపై ఒంటరి ఏనుగు దాడిలో ఒకటి అక్కడికక్కడే మృతి చెందగా మరో ఆవు తీవ్ర గాయాలతో చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. ఈ సంఘటన మండలంలోని పెద్దకాప్పల్లి పంచాయతీ అటవీ సరిహద్దు గ్రామమైన పెనుగొలకల సమీపంలోని వ్యవసాయ పొలాల వద్ద శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు వివరాలు.. పెనుగొలకల గ్రామానికి చెందిన రామయ్య కుమారుడు క్రిష్ణప్ప వ్యవసాయంతో పాటు పాడి పశువులు మేపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. పశువులను పగలంతా పొలాల వద్ద మేతకు వదిలి సాయంత్రం అక్కడే తాత్కాలికంగా ఏర్పాటు చేసిన షెడ్డు కింద కట్టేస్తుంటాడు. ఈ క్రమంలో శనివారం వేకువ జామున పలమనేరు రేంజ్ కీలపట్ల బీట్ నుంచి వచ్చిన ఒంటరి ఏనుగు పశువులపై ఒక్కసారిగా దాడి చేయడంతో ఒకటి అక్కడికక్కడే మృతి చెందగా మరో ఆవు తీవ్ర గాయాలతో చావు బతుకుల మధ్య విలవిల్లాడుతోంది. రోజువారీ కార్యక్రమంలో భాగంగా ఉదయం పొలం వద్దకు వెళ్లిన బాధిత రైతు జరిగిన సంఘటనను చూసి ఆందోళనకు గురయ్యాడు. ఏనుగుల దాడిలో దాదాపు రూ 80 వేలు నష్టం వాటిల్లిందని వాపోయాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పుంగనూరు ఎఫ్‌ఆర్వో శ్రీరాములు.. ఆవుకు పంచనామా నిర్వహించి, తీవ్రగాయాలతో ఉన్న మరో ఆవుకు చికిత్స చేయించారు. వివరాలను ఉన్నతాధికారులకు పంపి నష్టపరిహారం మంజూరుకు చర్యలు తీసుకుంటామని ఎఫ్‌ఆర్వో తెలిపారు. కార్యక్రమంలో ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్‌లు సుకుమార్, బాలసుబ్రమణ్యం, ఎఫ్‌బీఓ రవికుమార్ పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖకు నష్టం రూ.11 లక్షలు



కొంగారెడ్డిపల్లెలో పనులను పర్యవేక్షిస్తున్న ఈఈ మునిచంద్ర



గుడిపాల పానాటూరులో ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్తంభం

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లాలో శుక్రవారం సాయంత్రం వీచిన గాలీవానతో విద్యుత్‌శాఖకు రూ.11 లక్షలు నష్టం వచ్చిందని ట్రాన్స్‌కో ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు. శనివారం నష్టం వివరాలను తెలియజేశారు. చిత్తూరు నగరం, గుడిపాల, యాదమరి, జీడీనెల్లూరు, పులిచెర్ల, సదుం ప్రాంతాల నందు మొత్తం 78 కరెంటు స్తంభాలు, 16 ట్రాన్స్‌ఫార్మర్లు, 2.5 కిలోమీటర్లు కేబుల్, కిలోమీటర్ కండక్టర్ నేలవాలిందన్నారు. దీంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడిందన్నారు. సిబ్బంది క్షేత్రస్థాయిలో పునరుద్ధరణ చర్యలు చేపట్టారన్నారు. నగరంలో కొంగారెడ్డిపల్లెలో జరుగుతున్న పనులను ఈఈ మునిచంద్ర పరిశీలించారు.

రేపు కలెక్టరేట్‌లో పీజీఆర్‌ఎస్ రద్దు

చిత్తూరు కలెక్టరేట్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈనెల 5వ తేదీన కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)ను రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించాల్సిన పీజీఆర్‌ఎస్ ను రద్దు చేసి పలమనేరులో నిర్వహించనున్నట్లు చెప్పారు. సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పీజీఆర్‌ఎస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

భయపెట్టిన ఈదురు గాలులు

- నేలకొరిగిన చెట్లు, స్తంభాలు, దాబాలు



పుంగనూరు మండలం జాతీయ రహదారిపై దాబా రేకులు కూలిపోయిన దృశ్యం



చౌడేపల్లె మండలం కోటూరు వద్ద నేలవాలిన రాగిపంట



మేకలచిన్నేపల్లె వద్ద బీర పంట ఇలా..

పుంగనూరు/చౌడేపల్లె: పుంగనూరు, చౌడేపల్లె మండలాల్లోని పలు ప్రాంతాల్లో శనివారం తీవ్రమైన గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో చెట్లు కూలిపోయాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పుంగనూరు – భీమగానిపల్లె జాతీయ రహదారిపై కృష్ణదేవరాయుల సర్కిల్‌లో వున్న హైమాస్క్ లైట్లు గాలికి విరిగిపోయాయి. జాతీయ రహదారిలో ఉన్న దాబాల పైకప్పుకు వేసిన రేకులు ఎగిరిపోయాయి. ఆ సమయంలో నిర్వాహకులు మినహా ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అలాగే సింగిరిగుంట, మంగళం, ఏటవాకిలి, మొరుంపల్లి, బండ్లపల్లి, గుడిసెబండ తదితర ప్రాంతాల్లో టమాట పంట దెబ్బతినింది. చౌడేపల్లె మండలంలోనూ గాలీవాన భీభత్సం సృష్టించింది. వడగండ్ల వాన కురిసింది. మామిడి, వరి, బీర తదితర పంటలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం సహాయం అందించాలని రైతులు కోరుతున్నారు.